క్లుప్తంగా

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన కొత్త సీఐ



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు పూలమొక్కను అందిస్తున్న సీఐ కిషోర్

సాక్షి, భీమవరం: భీమవరం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.సత్యకిషోర్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ప్రజల మన్నన పొందాలన్నారు.

ఎలిశెట్టి మృతి తీరని లోటు



రామ్మోహన్ (ఫైల్)

వీరవాసరం: నటుడు, దర్శకుడు, రిటైర్డ్ అధ్యాపకుడు ఎలిశెట్టి రామ్మోహన్ మృతి తీరని లోటని శ్రీకృష్ణ దేవరాయ నాటక కళాపరిషత్తు కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కళాపరిషత్ రాయకుదురు గౌరవ సభ్యుడిగా విలువైన అందించారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సర్పంచ్ గెడ్డం భారతి, గెడ్డం భాస్కరరావు, నటుడు, నాటక దర్శకుడు కొడమంచిలి సత్యప్రసాద్, అడబాల రాజు, అడబాల బాబీ సంతాపం తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మొగల్తూరు: బేడ, బుడగ, జలగల కులస్తులను షెడ్యూల్ కులాల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు,కుమారి నాంచారయ్య, వైరింగం నాంచారమ్మ, కుమారి దుర్గారావు, లక్ష్మీ, రాందాసు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగమణి, ఏసు, పిచ్చియ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో గురువారం కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ పోతురాజు వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు గ్రామానికి చెందిన సుమారు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంట పరీక్షలు నిర్వహించిన వారిలో 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద పోతురాజు చిట్టిబాబు, మాజీ సర్పంచ్ చొప్పల సూర్యప్రకాష్ తదితరులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన లిఖితపూడి గ్రామానికి వచ్చి కిమ్స్ వైద్యులు సేవలందించడం చాల సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వర్ధనపు మణిరత్నంరాజు, పితాని మురళీకృష్ణ, వీరవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలకు నాక్ బీ డబుల్ ప్లస్ గ్రేడ్

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల అయిన దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నాక్‌కు ఎంపికైనట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ నెల 20, 21లో జరిగిన నాక్ కమిటీ పర్యవేక్షణలో తమ కళాశాలకు బి డబుల్ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు తెలిపారు. తమ కళాశాల నాక్‌కు ఎంపికవడానికి సహకరించిన ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోల భాస్కర్‌కు, పట్టణ ప్రముఖులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు, పూర్వ విద్యార్థులు, సీపీడీసీ సభ్యులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థి దశలో కష్టపడితే జీవితమంతా విజయాలే

నరసాపురం: ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విద్యార్థి దశలోనే ఆ లక్ష్యం చరుకునే విధంగా కష్టపడితే జీవితమంతా విజయాలు వెంట వస్తాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రా జి.సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ చదువు, ఉపాధి విషయంలో పూర్వపు రోజులు మారాయన్నారు. కష్టపడి చదివిన వారికి మంచి మంచి ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. సూర్యా కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, వైఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

పోడూరు: జిన్నూరులోని యెహోవా నిస్సీ ప్రార్థనా మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు గురువారం ముగిశాయి. బ్రదర్ షాలేమ్‌రాజు సందేశమిస్తూ ప్రతి ఒక్కరూ దేవుని మార్గంలో నడుచుకోవాలన్నారు. చర్చి పాస్టర్ సువర్ణరాజు, వడ్డి రవికుమార్, పీతల అజయ్ పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా



ఆకివీడులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద లంబోదరుడి ఊరేగింపు

ఆకివీడు: మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి పల్లెలో, వీధుల్లోనూ ప్రత్యేక పందిళ్లు, విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విఘ్నాలు తొలగించాలని విఘ్నరాయుడ్ని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వక్రతుండుడ్ని, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించే విధంగా ఆశీర్వదించాలని మహా గణపతిని, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని గణాధ్యక్షుడ్ని, సిరి సంపదలు కల్పించాలని ఏకదంతుడ్ని పూజించారు. ఆయా పందిళ్లలో రెండు కేజీల లడ్డూ నుంచి 20 కేజీల పైబడి లడ్డూలను బొజ్జగణపతికి ప్రసాదంగా అందజేశారు. గురువారం గణపతి విగ్రహాల నిమజ్జనాలు కొనసాగాయి. ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 283 విగ్రహాల్ని ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో గణనాథుడికి పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో 15వ రోజు నిమజ్జనం చేసేందుకు ఆయా పందిళ్లలో పూజలు కొనసాగుతున్నాయి.

ఘనంగా నిమజ్జనాలు

కాళ్ల: గణపతి నవరాత్రుల సందర్భంగా వినాయక నిమజ్జనం కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా జువ్వలపాలెం గ్రామంలో ప్రత్యేక వాహనంపై వినాయకునికి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక దుస్తుల్లో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. విచిత్ర వేషధారణ, బుట్టబొమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాళ్లకూరు తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు అనంతరం మేళతాళాలు, తీన్మార్ వాయిద్యాల నడుమ యువత వినాయక విగ్రహాల ఊరేగింపులు వైభవంగా నిర్వహించి పంట కాలువల్లో నిమజ్జనం చేశారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

భీమవరం (ప్రకాశం చౌక్): అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదని గ్రంధి రవితేజ అన్నారు. వరసిద్ధి వినాయక చవితి 31వ వార్షికోత్సవాల సందర్భంగా భీమవరం 10వ వార్డులో గురువారం అన్న సమారాధన కార్యక్రమాన్ని గ్రంధి రవితేజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు మాజీ కౌన్సిలర్ విగ్రహ దాత నందమూరి ఆంజనేయులు, 9, 10 వార్డుల మాజీ కౌన్సిలర్లు వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ వైఎస్సార్ సీపీ నాయకులు తోట శంకరం, బుద్ధరాజు రామకృష్ణవర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు బొత్స ధర్మా, సోమాదుల పెదిరాజు, బంగారు శివ పాల్గొన్నారు.

వేడుకగా ఊరేగింపులు

వీరవాసరం: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య స్వామి వార్ల ఊరేగింపు వేడుకగా చేపట్టారు. తీన్మార్ డాన్సులతో, డీజేలతో యువత పెద్ద ఎత్తున ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతల కొడుతూ గణేష్ మహారాజ్ కి జై అంటూ నినాదాలు చేశారు. వీరవాసరం పశ్చిమ కాలువలో, రాయకుదురు, మడుగు పోలవరం, మత్స్యపురి గ్రామాల్లోని గొంతేరు డ్రెయిన్లలోను విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వినూత్నంగా వినాయక నిమజ్జనం



భీమవరంలో కలశాలతో ఊరేగింపుగా నీరు తీసుకువస్తున్న మహిళలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని 27వ వార్డులోని జాలర్ల రెండో వీధిలో మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి 13వ వార్షిక మహోత్సవం సందర్భంగా గురువారం స్వామివారి నిమజ్జనోత్సవం వినూత్న రీతిలో నిర్వహించారు. 108 మంది మహిళలు కలశాలతో గంగాజలంతో సన్నాయిమేళంతో శోభాయాత్రగా ఊరేగింపు నిర్వహించి ఉత్సవంలోని మట్టి గణేష్ ప్రతిమను మండపంలోనే గంగాజలంతో నిమజ్జనం చేశారు. మహిళలంతా సంప్రదాయ దుస్తులు ధరించి తలపై కలశాలను పెట్టుకుని నీటిని తీసుకురావడమే కాక, మట్టితో తయారుచేసిన గణేష్ ప్రతిమలోని మట్టిని భక్తులు స్వామివారి ప్రసాదంగా భావించి పొలాల్లోకి, ఇళ్లల్లోని మొక్కల్లోకి చల్లడానికి తీసుకువెళ్లడం విశేషం. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ కాలుష్య నివారణకై ప్రభుత్వం మట్టి ప్రతిమలనే పూజిద్దామని చేపట్టిన కార్యక్రమాన్ని పాటిస్తూ సంప్రదాయబద్ధంగా నిమజ్జనోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. వారధి టీం, ఉత్సవ కమిటీ సభ్యులు వాల్మీకి బాలాజీ, విజ్జురోతు రాఘవులు, కొక్కిరి కనకమహాలక్ష్మి, వాడమదుల సూర్యం, కరుకు కొండమ్మ, రామిశెట్టి లక్ష్మి, వి.మంగ, రామిరెడ్డి చిన్ని, మోదు రాజు, వాల్మీకి అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ఉండి సాలిపేటలో వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ఆధ్యాత్మిక జీవితం మనిషిని శాంతి సంతోషాలతోను, అభివృద్ధి పథంలో నడిపిస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి సాలిపేటలో వేంచేసియున్న సిద్ధి వినాయకస్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి పీవీఎల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా 61 మంది వృద్ధులకు వస్త్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పీవీఎల్ భక్తులకు వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తను కలిగి ఉండాలన్నారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, గులిపల్లి అచ్చారావు, సర్పంచ్ కమతం సౌజన్య, కరిమెరక మల్లికార్జున, కరిమెరక శివనాగరాజు, గుండాబత్తుల సుబ్బారావు, శేషాద్రి శ్రీను, రాయి సతీష్, మాసాబత్తుల నాగరాజు, మాసాబత్తుల రామకృష్ణ, మాసాబత్తుల మురళీ పాల్గొన్నారు.

గ్రూప్-1 టాపర్ ప్రత్యూషకు ఘన స్వాగతం



ప్రత్యూషకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న సాయిబాబా ఆలయ అర్చకులు

కాళ్ల: ఇటీవల విడుదలైన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) హోదాలో మొదటిసారి స్వగ్రామం సీసలి వచ్చిన గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూషకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తొలుత గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుటుంబ సభ్యులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ర్యాంకు సాధించి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన తనకు గ్రామస్తులు చూపిన ఆదరణ మరిచిపోలేనన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మనపై మనకు నమ్మకం ఉంటే విజయం మన వెంటే ఉంటుందని అన్నారు. ఏలూరు జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ)గా పనిచేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. యూపీపీఎస్సీ మెయిన్స్ రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఐఏఎస్‌గా చూడాలన్న తన తండ్రి కల నెరవేర్చాలన్నదే తన ఆశయమన్నారు. ప్రత్యూషను మాజీ సర్పంచ్ కత్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు గజమాలతో సత్కరించారు.

భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



భీమవరంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దేశ స్వాతంత్య్రం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసి ఉరికంబం ఎక్కిన సర్దార్ భగత్‌సింగ్ ఆశయసాధనకు పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్ జయంతిని భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ బ్రిటిష్ దాస్యశృంఖలాల నుంచి జాతి విముక్తి కోసం భగత్‌సింగ్ స్వాతంత్ర్యోద్యమంలో వీరోచిత పోరాటం చేసిన దేశభక్తుడన్నారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, వైవీ ఆనంద్, పాలా త్రిమూర్తులు, చాంద్ బాషా పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తత అవసరం



గుట్లపాడు సబ్‌సెంటర్‌లో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. గుట్లపాడు సబ్ సెంటర్‌లో గురువారం డాక్టర్ వైఎస్సార్ అవ్వతాతల కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్ర వైద్యులు బి.రామకృష్ణ 125 మందికి నేత్ర పరీక్షలు చేసి 35 మందికి కంటిలో శుక్లాలు వల్ల అంధత్వం ఉన్నట్లు గుర్తించారు. 22 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని బుద్ధుడు కంటి ఆస్పత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా కంటి శస్త్ర చికిత్సలు చేయుంచనున్నట్లు తెలిపారు. కొంతమందికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ నేత్ర వైద్య పరీక్షలు చేసిన వారికి అవసరం మేరకు ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు, ఉచితంగా కళ్ల జోళ్లు, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎంతోమంది కళ్లల్లో శుక్లాలు ఏర్పడటంతో అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. సీహెచ్‌ఓ శుభశ్రీ, ఏఎన్‌ఎం కే భారతి, సంగాని వెంకటలక్ష్మి, రేవు సత్యవతి, సంధి విమల, ఎన్.నాగలక్ష్మి, బి.లక్ష్మి, బండి ముత్యాలమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు తూర్పుకాపు సంఘం కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఓబీసీ సమస్యపై జిల్లాలో తూర్పు కాపు సంఘ సభ్యులు ఎప్పటి నుంచో ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా కలెక్టర్ చొరవతో ఆ సమస్య నేటితో పరిష్కారమైందని తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం అధ్యక్షులు లోపింటి చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఓబిసి మాన్యువల్ ఇచ్చేలా ఆర్‌ఓసి ఏర్పాటు చేశారన్నారు. దానికి అనుగుణంగా నేడు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి నూతనంగా ఆర్‌ఓసీ ఇవ్వడంతో మైగ్రేషన్ ద్వారా ఓబీసీ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో తీసుకునే వెసులుబాటు కల్పించారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఓబీసీ విషయంలో సమతమతమవుతున్న తూర్పు కాపు విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతికి తమ తూర్పుకాపు సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సంఘ సభ్యులు కర్నేని గౌరునాయుడు, జమ్ము ముత్యం, మీసాల రాము, బాకూరి నిరంజన్, కరుమొజ్జు సత్యనారాయణ, పాట్నూరి శ్రీనివాసు, వాకాడ అప్పారావు, దనాని సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భీమవరంలో రోటరీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని వీఎస్‌కే కళాశాలలో రోటరీ ఉచిత వికలాంగుల ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వబిలిశెట్టి పట్టాభిరామయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రోటరీ స్కూల్ ద్వారా అనేక మంది విద్యార్థులకు పోలియో వ్యాక్సిన్ వేయించామని, అలాగే 256 మంది పోలియో బాధితులకు ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. వైద్యులు జేవీఎస్ విద్యాసాగర్, సోమరాజు, ఎస్‌వీబీ రామరావు, వెంప రామకృష్ణంరాజు అందించిన సేవలు మరవలేనివన్నారు. అలాగే పోలియో విద్యార్థులకు జి.కృష్ణమూర్తి, ఇందిరాదేవి, సావిత్రి, మాణిక్యాంబ, సుజాత, సత్యవతి, సుభాషిణి, పెద్దిరాజు, రేణుక అమూల్యమైన సేవలందించారన్నారు. బొండా వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత



బేతపూడిలో ఓ ఇంట్లో మహిళకు వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న కొట్టి కుటుంబరావు



ఎన్నార్పీ అగ్రహారంలో జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ కొట్టి కుటుంబరావు అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం 104 ద్వారా ప్రతి గ్రామానికి వైద్య సేవలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా వైద్య బృందం ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్ అవ్వతాతల కంటి వెలుగు ద్వారా వైద్య సేవలు, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఏఎన్‌ఎం, వలంటీర్, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి రోగుల వివరాలను యాప్‌లో నమోదు చేసి ఈ నెల 30 తరువాత మండల వ్యాప్తంగా జరిగే మెగా వైద్య శిబిరంలో ఉచితంగా చికిత్స అందిస్తారన్నారు. ఈ వైద్య పథకాలను గ్రామీణులు ఎంతగానో సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బుంగా ప్రహ్లాదుడు, కొట్టి శివకుమార్, కురేళ్ల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కురేళ్ల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పరీక్షలతో ప్రజల్లో ఆనందం

ఉండి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ముందస్తుగా నిర్వహిస్తున్న వైద్య పరీక్షలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయితీలలోని 21 సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇంట్లోని ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై వివరాలు సేకరించి బీపీ, సుగర్, జ్వరం, మలేరియా, డెంగీ, యూరిన్ తదితర ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు హాజరయ్యేవారికి ముందుగానే టోకెన్‌లు కూడా జారీ చేస్తున్నారు. ఎంతో శ్రద్ధతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల కొరకు ఆయా గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా వైద్య సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో అధికారులు కూడా అప్రమత్తమై ప్రతి ఒక్కరిపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గురువారం ఎన్నార్పీ అగ్రహారంలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను సేకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

భీమవరం అర్బన్: తాడేరు విద్యుత్ ఉపకేంద్రంలో వార్షిక మరమత్తుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. భీమవరం వన్‌టౌన్‌లో టిడ్కో ఏరియా, వైఎస్సార్ కాలనీ, నల్లంవారి తోట, బ్రిడ్జిపేట, పోతుల వారి పేట, గుళ్ళంకి వారి పేట, ఎంప్లాయీస్ కాలనీ, గరువు పేట, అంబేడ్కర్ సెంటర్, సోమగుండం చెరువు ఏరియా, నాచువారి సెంటర్, బేతనీపేట, చిన అప్పారావుతోటలతో పాటు మండలంలోని తాడేరు, యమునాపల్లి, కొవ్రపాడు, బేతపూడి, కరుకువాడ, యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వామినాథన్ మృతికి సంతాపం

సాక్షి, భీమవరం: ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి సీపీఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. జిల్లా కార్యదర్శి బి బలరాం మాట్లాడుతూ స్వామినాథన్ దేశంలో వ్యవసాయ రంగ పరిశోధనలకు, అభివృద్ధికి మూలస్తంభం లాంటి వ్యక్తి అన్నారు. హరితవిప్లవ పితామహుడిగా స్వామినాథన్ సూచనలు, పలు కమిషన్లలో ఆయన సిఫార్సులు దేశానికి ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన స్ఫూర్తితో వ్యవసాయరంగాన్ని ఆదుకోవడానికి, రైతుల ఆత్మహత్యల నివారణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని బలరాం కోరారు.

నేడు వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి సమర్పించిన చీరలు, జాకెట్టు ముక్కలు, కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు. రెండేళ్ల కాల పరిమితితో సేకరణ హక్కులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చినఅమిరం గ్రామంలో సరిహద్దు తగదాలో ఓ వ్యక్తి దాడి చేసి గాయపర్చాడని యర్రా కర్ణుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జి.శ్రీనివాస్ గురువారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణుడు నివాసం సరిహద్దులో ఉంటున్న యర్రా శ్రీనివాస్ ఇద్దరి మధ్య ఈనెల 27న వివాదం ఏర్పడడంతో శ్రీనివాస్ కర్రతో కర్ణుడ్ని గాయపర్చాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కర్ణుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రికి తరలింపు

వీరవాసరం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వీరవాసరం ఎస్సై పి.రమేష్ గురువారం చెప్పారు. ఈనెల 27న నౌడూరు జంక్షన్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ పడి ఉండడంతో 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పూర్తి వివరాలు తెలియలేదని, ఆచూకీ తెలిస్తే వీరవాసరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

చంద్రబాబు మెడకు బిగుస్తున్న అవినీతి కేసుల ఉచ్చు

పాలకొల్లు అర్బన్: ప్రజాధనాన్ని కొల్లగొట్టిన చంద్రబాబు మెడచుట్టూ అవినీతి కేసుల ఉచ్చు బిగిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రింగ్‌రోడ్డు కేసులో ఏ 14 ముద్దాయిగా నారా లోకేష్‌ను పోలీసులు నమోదు చేశారన్నారు. కేసులకు భయపడి లోకేష్ న్యూఢిల్లీలో దాక్కున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 52 నెలల పాలనలో 14 నెలలు కోవిడ్ కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడినా ఇచ్చిన హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. స్కామ్‌ల్లో ఇరుక్కున్న చంద్రబాబును అరెస్ట్ చేస్తే తెలుగు తమ్ముళ్లు అల్లర్లు చేయడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. నాయకులు దేవ రాజేష్‌కుమార్, పాలపర్తి కృపానాథ్, బావన సునీల్, సాలా శ్రీను, ఇంజేటి వరప్రసాద్, వడ్డి సత్య ప్రసాద్, వడ్డి సంజీవ్‌కుమార్, బద్దా శరత్‌బాబు పాల్గొన్నారు.